క్లుప్తంగా

మొరాయించిన ఆర్టీసీ బస్సు



రైల్వే వంతెన సమీపంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

పెనుకొండ రూరల్: ప్రయాణం మధ్యలోనే ఆర్టీసీ బస్సు మరమతుకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హిందూపురం డిపోకు చెందిన అల్ట్రా పల్లె వెలుగు బస్సు హిందూపురం నుంచి సోమవారం మధ్యాహ్నం 30 మంది ప్రయాణికులతో ధర్మవరం బయలు దేరింది. అయితే పెనుకొండ రైల్వే రైల్వే వంతెన దాటగానే ఆగిపోయింది. చేసేదిలేక కొందరు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లిపోగా.. మరికొందరు ప్రయాణికులు మరమ్మతు పూర్తయ్యే దాకా నిరీక్షించారు.

టీడీపీ గెలుపు అప్రజాస్వామికం

మడకశిర: రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలకు సోమవారం జరిగిన చైర్మన్ స్థానాల ఎంపికలో అధికార టీడీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల అధికారులు, పోలీసులు కూడా విఫలమయ్యారన్నారు. అధికార పార్టీకి వ్యవస్థలు కూడా అండగా నిలబడటం అన్యాయమన్నారు. హిందూపురం మున్సిపల్ ఎన్నికలను అప్రజాస్వామ్యంగా నిర్వహించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను అధికార పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారన్నారు. ఇది గెలుపే కాదన్నారు.

శ్మశాన వాటికకు స్థలమివ్వండి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గుడిబండ: 'ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటికకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా శ్మశాన వాటిక స్థలం కేటాయించండి' అంటూ ఆర్య వైశ్య సంఘం సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తిని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో దాదాపు వందకు పైగా ఆర్యవైశ్య కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. శ్మశాన వాటిక స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే చొరవ చూపి స్థలం కేటాయించాలన్నారు.

రెండు ఆవుల అపహరణ

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి పంచాయతీ అలుపనపల్లిలో శ్రీనివాస్, అమ్మాజక్కకు చెందిన రెండు ఆవులను ఆదివారం రాత్రి దుండగులు అపహరించుకెళ్లారు. రోజూ మాదిరిగానే ఆవులను పొలం వద్ద మేత కోసం తీసుకువెళ్లి తిరిగి సాయంత్రం ఇంటి పక్కనే ఉన్న వారపాకలో తాడు సహాయంతో కట్టేశామని బాధితులు తెలిపారు. శ్రీనివాస్, అమ్మాజక్కల రెండు ఇళ్లు పక్కపక్కనే ఉండడంతో ముందుగా శ్రీనివాస్ ఆవును, తర్వాత అమ్మాజక్క ఆవును కట్టేసిన తాడును కట్‌చేసి రెండు ఆవులను అపహరించుకెళ్లారని వాపోయారు. రెండు ఆవుల విలువ రూ.1.5 లక్షల వరకూ ఉంటుందన్నారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు.

వివిధ సమస్యలపై అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రెవెన్యూ, ఇతర సమస్యలకు సంబంధించి ఏడు ఫిర్యాదులు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

రొళ్లలో...

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం నిర్వహించిన ప్రజా వేదిక సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో రెవెన్యూశాఖకు 1, పంచాయతీ రాజ్‌శాఖకు 2, పింఛన్ల కోసం 2 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధితశాఖ అధికారులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా కొల్లాపురమ్మ ఉత్సవం



అలంకరణలో కొల్లాపురమ్మ

అగళి: మండల పరిధిలోని హనుమనపల్లిలో సోమవారం సాయంత్రం నుంచి రత్నగిరి కొల్లాపురమ్మ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రత్నగిరిలో వెలసిన కొల్లాపూరి మహలక్ష్మి అమ్మవారిని మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. హనుమనపల్లిలో పట్టం కూర్చొబెట్టి పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మిర్చి రైతులకు తామర టెన్షన్!



తామర పురుగు సోకిన మిర్చి మొక్క

- రసాయన మందులు పిచికారీ చేస్తున్నా అదుపులోకి రాని తెగుళ్లు
- తగ్గిపోనున్న పంట దిగుబడి
- ఆందోళనలో అన్నదాతలు

"ఖరీఫ్ సీజన్‌లో మిరప పంట సాగు చేసిన రైతులు తెగుళ్ల సమస్యలతో సతమవుతున్నారు. పైరు బాగుందనుకుంటున్న సంతోషం అన్నదాతలకు ఎక్కువ రోజులు నిలవడం లేదు. ముఖ్యంగా పంటకు తామర పురుగు వ్యాపించడంతో కర్షకులకు ఆందోళన తప్పడం లేదు."



తామర పురుగులు

గుడిబండ: మడకశిర నియోజకవర్గంలో పచ్చి మిర్చి పంటను 910 ఎకరాల్లో సాగు చేశారు. అయితే మిర్చి ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తుందన్న సమయంలో తామర పురుగు అతలాకుతలం చేస్తోంది. ఇటీవల మిర్చి పంటలపై కొమ్మతెగులు, కుచ్చు తెగులు ప్రభావం చూపించగా తాజాగా పూతలో తామర పురుగు కనిపించడంతో పాటు వేరు కుళ్లు పురుగులు చుట్టుముట్టాయి. రాత్రింబవళ్లు కంటికి రెప్పలా పెంచుకున్న పంట కళ్లెదుటే వాడిపోతుంటే రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

తామర పురుగుతో పంటకు దెబ్బ

తామర పురుగు వ్యాప్తి చెందుతోందని గుర్తించిన వారం రోజుల వ్యవధిలోనే పంట నాశనం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామర గుడ్డు నుంచి పురుగుగా మారేందుకు 10–15 రోజులు పడుతుంది. ఇది తల్లి దశలో ఉన్న సమయంలో పూతలో పెరిగి పూత నుంచి కాయలు రానివ్వకుండా రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మంచు కురిసే సమయంలో తామర పురుగు వ్యాప్తి విపరీతంగా ఉంటుంది. మిరపచెట్లకున్న ఆకుల్లో రసాన్ని పీల్చి ముడతగా మార్చేస్తుంది. ముడతతో పాటు మొగ్గలపై కూడా ప్రభావం చూపడంతో పూత నేల రాలిపోతోంది. ఒక వేళ అరకొర పూత మిగిలినా కాయ సైజు పొట్టిగా మారుతుంది. దీంతో దిగుబడి చాలా వరకు తగ్గిపోతోందని, ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్లకు మించి పంట రాదని అన్నదాతలు వాపోతున్నారు.

మందులు పిచికారీ చేసినా..

తామర పురుగు నివారణకు పలు రసాయన మందులు ఎన్నిసార్లు పిచికారీ చేసినా ఫలితం కనిపించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి తెగుళ్లు సోకకుండా ఉంటే ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చేదని, అయితే ఎరువులు, రసాయన ధరలు పెరగడంతో పెట్టుబడి మరింత భారం పెరిగిందని చెబుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

వ్యాపారుల సిండికేట్

మిర్చి దిగుబడి కొంత వరకు బాగున్నా గిట్టుబాటు ధర మాత్రం రావడం లేదని, ఇందుకు వ్యాపారస్తులు సిండికేట్ కావడమే కారణమని రైతులు చెబుతున్నారు. వ్యాపారస్తులు అంతా కలిసి మిర్చి ధరను ఒక్కసారిగా తగ్గించి వేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మిర్చికి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మిర్చి సాగు ఇలా...

మండలం	సాగు చేసిన విస్తీర్ణం
గుడిబండ	250 ఎకరాలు
అమరాపురం	280 ఎకరాలు
రొళ్ల	100 ఎకరాలు
మడకశిర	180 ఎకరాలు
అగళి	100 ఎకరాలు

తామరతో పంట నాశనం



తామర పురుగుతో మిర్చి పంట నాశనమవుతోంది. నాకున్న ఎకరా పొలంలో మిర్చి పంటను సాగు చేశా. మొన్నటి వరకూ మిర్చి పంట బాగానే ఉంది. ఉన్నట్టుండి తామర పురుగు కనిపించింది. దీంతో పూత, లేత ఆకులు రాలిపోతున్నాయి. ఎన్నో రకాల రసాయన పురుగు మందులు పిచికారీ చేసినా నివారణ కావడం లేదు. ఇప్పటి వరకు రూ.55 వేలు పెట్టుబడి పెట్టాను. ఎరకాకు 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం కూడా లేదు. ఏం చేయాలో అర్థంగాక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. ప్రభుత్వమే నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి.

– బెళిగేరప్ప, రైతు. దిన్నెహట్టి గ్రామం, గుడిబండ మండలం.

తెగుళ్లతో సతమతం



పచ్చి మిర్చి తోటలకు రకరకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో పురుగు మందులను పిచికారీ చేసేందుకు వేలాది రుపాయలు వెచ్చించాల్సి వస్తోంది. పురుగు మందుల ధరలు, కూలి రేట్లు పెరిగిపోయాయి. వ్యాపారస్తులు సిండికేట్ అవుతుండటంతో రైతులకు సరైన గిట్టుబాటు ధర పలకడంలేదు. కనీసం బస్తాకు రూ. 2000 ధర కల్పిస్తే కొంత మేరకు గిట్టుబాటు అవుతుంది. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి రైతులు నష్టపోకుండా చూడాలి.

– తిప్పేస్వామి, రైతు. పిఎస్ పాళ్యం, గుడిబండ మండలం

రైతుల కష్టాలు పట్టించుకోరా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరరూరల్: అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంటల సాగుకు రైతులు పడుతున్న కష్టాలను పట్టించుకుని పెట్టుబడి సాయం డబ్బును వారి ఖాతాల్లోకి జమ చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. ఎనిమిది నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బోరు బావుల్లో నీటి సౌకర్యం ఉన్నా పంట సాగుకు ప్రభుత్వ సాయం అందక అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు.

'ఫీజు పోరు'ను విజయవంతం చేయండి

మడకశిర: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మార్చి 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. రూ.3,900 కోట్లను పెండింగ్‌లో ఉంచడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేటికీ పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్మశాన వాటిక కబ్జాను అడ్డుకోండి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

చిలమత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారని, శ్మశాన వాటికలను కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో భూముల ధరలు పెరగడంతో శ్మశానాలకు కేటాయించిన స్థలాలపై కొందరు కన్ను వేశారని, రెవెన్యూ అధికారులు అలాంటి వాటిని గుర్తించి కబ్జాదారుల నుంచి ఆ భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నరసింహప్ప, నాగిరెడ్డి, బాలచంద్ర, రామాంజి, గంగాధరప్ప, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గంగమ్మకు పూజలు

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురం పులమతి రోడ్డులోని గంగమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం నుంచే గంగమ్మను అలంకరించి గణపతి, నవగ్రహ,దుర్గాదేవి, మనుసూక్త సుదర్శన మృత్యుంజయ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి పూజలు చేశారు. శ్రీకంఠపురం ఆలయ సభ్యులు అమ్మవారి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

నాగుల విగ్రహాల ప్రతిష్ట

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని షిర్డీనగర్‌తో పాటు బైలాంజనేయ స్వామి ఆలయం వద్ద నాగుల విగ్రహాల ప్రతిష్ట సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూల మంత్ర హోమం, అభిషేకాలు చేశారు. షిర్డీ నగర్‌లో విగ్రహ దాత బాబయ్య, కట్ట నిర్మాణానికి రూ.40 వేలు ఇచ్చిన దాత రవికుమార్, 50 మూటల సిమెంట్ ఇచ్చిన శ్రీనివాసులును కాలనీ వాసులు సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

అమరాపురం: స్థానిక సరస్వతి విద్యామందిరంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు హరీష్ భట్టాచార్యులు హోమాలను నిర్వహించారు. అనంతరం సరస్వతీమాత చిత్రపటం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి చిత్రటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదర్శ'ంగా విజ్ఞాన ప్రదర్శన



స్మార్ట్ సిటీ ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పావగడ: పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాఠశాలకు చెందిన 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులు సుమారు వంద మంది ఈ విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రేణుకారాజ్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

వక్క తోటకు నిప్పు



అగ్ని ప్రమాదంలో బూడిదైన వక్క తోట

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామ సమీపంలో రైతు బీకే మునిస్వామికి చెందిన వక్క తోట అగ్నికి ఆహుతైంది. ఆదివారం సాయంత్రం గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో మంటలు వక్కతోటకు వ్యాపించడంతో తోట మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో 300 వక్క చెట్లు, 50 కొబ్బరి చెట్లు, చింత చెట్లు దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయారు. అలాగే బోర్‌వెల్ సెట్, జీవామృత నీటి ట్యాంకు, విద్యుత్ సరఫరా లైను కాలియినట్లు చెప్పారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని మునిస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులే నష్టపరిహారం చెల్లించాలన్నారు.

రోడుపై మురుగు



అగళి ఎస్సీ కాలనీలో సీసీ రోడుపై పారుతున్న మురుగు

అగళి: మండల కేంద్రలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాల్వలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో నడిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయాలేదని, దీంతో ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై నిలబడుతుండటంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహాశివరాత్రి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యే బాలకృష్ణను ఆహ్వానిస్తున్న చైర్మన్ రమానందన్

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే బాలకృష్ణను లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆహ్వానించారు. ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కార్యాలయంకు వెళ్లి ఆయనకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఉత్సవాలు విజయవంతం చేయడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకుల పల్లిలో సోమవారం సాయంత్రం పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆటోలో ప్రయాణం చేసే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. అదే విధంగా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కానిస్టేబుల్ జగన్‌నాయక్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా మడకశిర



విజేతలతో అధ్యాపకులు

మడకశిరరూరల్: ఆచార్య ఎన్‌జీ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మహానందిలో నిర్వహించిన అంతర్ వ్యవసాయ కళాశాలలు, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో మడకశిర వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ సరోజినిదేవి తెలిపారు. టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్, షటిల్, సాంస్కృతిక విభాగాల్లో మడకశిర వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచి బహుమతులను అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆ కళాశాలలో విజేతలను, పీడీ రమేష్ , క్రీడా బృందం ఆర్గనైజర్ కమల్‌ను అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయన్నారు. ఆత్మ విశ్వాసాన్ని పెంచి ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు.

ఆధ్యాత్మిక శోభ



పరిగి: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



రొళ్ల : రథాన్ని లాగుతున్న భక్తులు



గుడిబండ: కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



మడకశిర: చౌడేశ్వరీదేవి రథోత్సవం

- పలు ప్రాంతాల్లో రథోత్సవాలు, కల్యాణాలు, జ్యోతుల ఉత్సవాలు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం బ్రహ్మరథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు రథం ముందు భాగాన శాంతి హోమం, దీక్ష హోమ, బలిప్రదానం తదితర పూజలు చేశారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువు దీర్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు.

పరిగి: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపించారు.

మడకశిర రూరల్: మండల పరిధిలోని మెళవాయి సమీపంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి పెన్నయ్యబావి క్రాస్ వరకూ భక్తులు రథాన్ని ఊరేగించారు.

గుడిబండ: మండల పరిధిలోని హిరేతుర్పిలో వెలసిన ఆంజనేయస్వామికి సోమవారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు స్వామివారికి జ్యోతులు సమర్పించారు.

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యస్వామి జాతరోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు.

వీరభద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం

మడకశిర: పట్టణంలోని గాంధీ బజార్‌లో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రస్వామి ఉత్సవాలు సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహారుద్రాభిషేకం నిర్వహించారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ శాంతవీరప్ప తెలిపారు. రాత్రి పుష్పరథోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.